క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన గోపాల్, హసీనాలను ఎస్టీయూ ఆదోని, కౌతాళం మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, రమేష్ నాయుడు, అబ్దుల్ నబి, ఎస్టీయూ నాయకులు సుంకన్న, గోపాల్, రామాంజినేయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మిత్రులు

• జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న సునిల్ రాజ్ కుమార్‌ను తోటి మిత్రులు ఘనంగా సన్మానించారు. ఆదివారం నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో 1986–87 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులంతా కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. తమ మిత్రుడు ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకోవడం చాల సంతోషంగా ఉందని ప్రేమ్ కుమార్, రుద్రముని, లక్ష్మన్న, పంపాపతి, అన్ను, గోపాల్, మల్లీమస్తాన్, కేశవ తెలిపారు. కార్యక్రమంలో మిత్రులు శేఖర్, షేకన్న, నాగరాజు, వీరేంద్ర, లక్ష్మీనారాయణ, ఉలిగప్ప, జానార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ



గురజాడ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అభ్యుదయ రచయితల సంఘ సభ్యులు

ఆదోని సెంట్రల్: అభ్యుదయ కవితా పితామహుడు మహాకవి గురుజాడ అప్పారావు తన రచనలతో సాంఘిక దురాచారాలను తరిమికొట్టారని అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ తెలిపారు. ఆదివారం 163వ జయంతిని పురస్కరించుకొని పురపాలక ఉన్నత పాఠశాలలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో రచనలను సాగించి సమాజాన్ని మెల్కొలిపిన మహాకవియని కొనియాడారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు రామాంజి, ప్రసాద్, వీరచంద్రయాదవ్, పార్థసారథి పాల్గొన్నారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో భక్తుల సందడి



దర్గాలో బారులు తీరిన భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహలు, ప్రార్థనలు నిర్వహించారు. పిండి వంటలు వండి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. దర్గాలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఇబ్బందులు తప్పాయి.

పాండవగల్లులో శ్రమదానం



శ్రమదానంలో పాల్గొన్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్లు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పంచాయతీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. మొలిచిన పిచ్చిమొక్కలు, గడ్డిని తీసేసి శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, గడ్డి ఉండడంతో దోమలు చేరి చుట్టుపక్కన ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని, ఈ పిచ్చి మొక్కలను తొలగించడం వల్ల దోమల నివారణ చేయడానికి అవకాశం ఉందని డీవైఎఫ్ఐ మండల కన్వీనర్ వీరేష్ తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష కార్యదర్శులు కె.వీరేష్, వీరాంజి, మండల కమిటీ సభ్యులు ఎస్.తాయన్న, మోహన్‌రెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు అనంతస్వామి, మల్లికార్జున, ధనుంజయ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఉన్నత విద్య అందేనా?

- ప్రారంభానికి నోచుకోని మైనార్టీ కళాశాలలు
- వృత్తి విద్యాకోర్సులకు ఎదురు చూపులు
- ఉర్దూ మీడియం విద్యార్థులకు అందని కళాశాల విద్య
- దూరప్రాంతాలకు వెళ్లలేక చదువులు మానేస్తున్న వైనం



ప్రారంభానికి నోచుకోని మైనార్టీ జూనియర్ కళాశాల భవనం



నిరుపయోగంగా ఉన్న మైనార్టీ ఐటీఐ కళాశాల

ఆదోని సెంట్రల్: కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల ముస్లిం మైనార్టీలు ఉన్నతవిద్యకు దూరమవుతున్నారు. ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువులు అందిచాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనార్టీ విద్యార్థుల కోసం ఆదోనిలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (ఉర్దూ) నిర్మించింది. అలాగే మండల పరిధిలోని ఆరెకల్లు గ్రామంలో మైనార్టీ విద్యార్థుల కోసం ఐటీఐ కళాశాలను నిర్మించారు. అయితే అవి ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. దీంతో ఉర్దూ మీడియంలో ఉన్నత విద్యను అభ్యసించాలనే విద్యార్థులు, ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని అనే విద్యార్థులకు ఎదురు చూపులు తప్పడంలేదు. అదిగో ప్రారంభం అవుతాయి, ఇదిగో ప్రారంభం అవుతుంది అంటారు కానీ, ఇప్పటి వరకు ప్రారంభానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా మైనార్టీ విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. కళాశాలలను ప్రారంభించి విద్యార్థులకు విద్యను అందించాల్సిన ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

40 శాతం మంది ముస్లింలు

ఆదోని డివిజన్‌లో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. ఒక్క ఆదోని పట్టణంలోనే దాదాపు 30 నుంచి 40 శాతం మంది ముస్లింలు ఉన్నారు. పట్టణంలో దాదాపు 500 మంది పైచిలుకు పిల్లలు ఉర్దూ మీడియంలో విద్యను అభ్యసిస్తున్నారు. ఒక్క ఆదోనిలోనే ఇలా ఉంటే ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో వందలాది మంది విద్యార్థులు ఉర్దూ మీడియంలో చదువుకుంటున్నారు. అయా ప్రాంతాల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదువుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. కానీ, ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశాలు లేవు. ఉర్దూ మీడియంలో ఇంటర్మీడియట్, డిగ్రీ వంటి ఉన్నత చదువులను చదువుకోవాలంటే కర్నూలు, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి.

నిరుపయోగంగా జూనియర్ కళాశాల భవనం

ఆదోనిలో ప్రభుత్వ మైనార్టీ బాలిక జూనియర్ కళాశాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.160 కోట్లు నిధులను కేటాయించి భవన నిర్మాణం చేపట్టింది. నాలుగు తరగతి గదులతో పాటు ప్రిన్సిపాల్ గది, ప్రయోగశాల వంటి గదులను నిర్మించారు. టాయిలెట్స్‌తో పాటు విద్యుత్తు, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించారు. కళాశాలను ప్రారంభించి తరగతులను నిర్వహించాల్సిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజా ధనంతో నిర్వహించిన భవనాలు నిరుపయోగంగా మారి చివరికి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారే ప్రమాదం ఉంది. ఉర్దూ మీడియంలో ఉన్నత చదువులను చదువుకోవాలి అంటే కర్నూలు లేదా అనంతపురం, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. చాల మంది విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకొనలేక చదువును మధ్యలోనే అపేస్తున్నారు. ఉర్దూ మీడియంలో చదువుకొన్న విద్యార్థులు కళాశాల ప్రారంభం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. అకడమిక్ సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభానికి ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులను తీసుకొని ప్రారంభిస్తే ఎంతో మంది విద్యార్థినులు చదువుకోవడానికి అవకాశం కల్పించిన వారవుతారు.

మైనార్టీ ఐటీఐ కళాశాల

ఆదోని మండలం ఆరేకల్ గ్రామంలో ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం 2018లో పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.3.91 కోట్లతో తరగతి గదులతో పాటు ప్రాక్టికల్ తరగతులను నిర్వహించడానికి గదులను కూడా నిర్మాణం చేపట్టారు, విద్యార్థులకు వసతి సౌకర్యాలను కల్పించేందుకు వసతిగృహ భవనాన్ని కూడా నిర్మించారు. 2018–19 మధ్య కాలంలో భవనాలను అయితే నిర్మించారు గానీ, కళాశాలను అయితే ప్రారంభించలేదు. కళాశాల నిర్వహణ కోసం వివిధ ట్రేడ్‌లకు సంబంధించిన మెటిరీయల్‌ను అందుబాటులో ఉంచి కళాశాలను ప్రారంభించాల్సి ఉంది. మెటీరియల్ కనుగోలుకు నిధులు మంజూరు చేయకపోవడం, అధ్యాపకులను నియమించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఐటిఐ కళాశాల ప్రారంభమైయితే దాదపు 200 మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు వివిధ ట్రేడులలో శిక్షణ పొంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పరిచుకునేందుకు అవకాశం ఉంది. కళాశాల ప్రారంభానికి నోచుకోక పోవడంతో భవనాల చుట్టూ ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు మొలచి కళాశాల అవరణ అంతా అస్తవ్యస్తంగా మారింది. ట్రేడులకు అవసరమైన టూల్స్ (మెటిరీయల్స్) ఏర్పాటు చేసి, అధ్యాపకులను నియమించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆదోనిని జిల్లా చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

ఆదోని రూరల్: అత్యంత వెనుకబడిన ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి, కర్నూలు జిల్లాకు దామోదర్ సంజీవయ్య పేరు పెట్టాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదరం రాధాకృష్ణమూర్తి, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, ఆదినారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు యూజీ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో ఆదోని జిల్లా సాధన సమితి కన్వీనర్ కళ్లపోతుల రంగన్న, అభ్యుదయ దళిత సేవా సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి అంబేడ్కర్ నగర్ కుంకనూరు వీరేష్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గం పూర్తిగా వర్షాధార ప్రాంతం కావడంతో పంటలు సరిగా పండక రైతులు ప్రతియేటా అప్పుల పాలవుతున్నారన్నారు. ఆదోనిలో ఉన్న పరిశ్రమలన్నీ మూతపడడంతో ఉపాధి కోసం మహా నగరాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ఆదోని అభివృద్ధి చెందాలన్నా ఉపాధి అవకాశాలు రావాలన్నా జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమన్నారు. ఇందుకోసం పార్టీలకు అతీతంగా కుల సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలతో పాటు ప్రజలు ఏకతాటిపై వచ్చి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

గురజాలలో అమావాస్య పూజలు



రామాలింగేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

నందవరం : దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామికి భక్తులు ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గురజాల గ్రామంలో పవిత్ర శైవక్షేత్రంలో తెల్లవారుజాము నుంచే భక్తులు నది స్నానాలు ఆచరించి రామలింగేశ్వర స్వామి, పార్వతీదేవికి పురోహితులు హంపేష్ ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం ఆదిదంపతలకు మహామంగళహారతి చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. గురజాల క్షేత్రంతో పాటు నందవరంలోని బంగారమ్మవ్వ దేవాలయం, బీరప్ప స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

నేటి నుంచి దేవి శరన్నవరాత్రుల వేడుకలు

పవిత్ర పుణ్యక్షేత్రం గురజాల రాలింగేశ్వర స్వామి క్షేత్రంలో సోమవారం నుంచి దేవి శరన్నవరాత్రులు ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. వేడుకల్లో భాగంగా రామలింగేశ్వర స్వామికి, పార్వతీ దేవికి ప్రత్యేకాలంకరణలు గావిస్తారు. 22న సోమవారం ప్యాడమి రోజు అమ్మవారికి దేవి రజత కవచ అలంకారణ, 23న బాల త్రీపురసుందరి దేవిగా, 24న గాయత్రి దేవి, 25న శ్రీలలిత త్రీపురసుందరి దేవీగా అలంకారణ గావిస్తారు. 26న శుక్రవారం చవితి రోజు మహా లక్ష్మీదేవి అలంకారణ, 27న శ్రీమహాగౌరీ దేవి, 28న అన్నపూర్ణేశ్వరి దేవి, 29న సరస్వతి దేవిగా (మూల నక్షత్రం), 30న శ్రీదుర్గా దేవి, అక్టోబరు–1న మహిషాసుర మర్ధిని దేవిగా దర్శనమివ్వనున్నారు. 2వ తేదీ గురువారం విజయదశమి పండుగా పర్వదినం రోజున శ్రీరాజరాజేశ్వరి దేవిగా అమ్మవారిగా అలంకారణ గావిస్తారు. సాయంత్రం 5 గంటలకు శమీపూజ, శేషవాహనంపై ఆదిదంపతుల ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు



కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి విశేష పూజలు చేపట్టారు. ఆదివారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహామంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేలాలు సమర్పించి పూజలు చేసుకున్నారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తాదులకు ఆలయ కమిటీ సమక్షంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జీడీపీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

గోనెగండ్ల : గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటిని జీడీపీ అధికారులు శనివారం నుంచి నాలుగో గేటు ద్వారా హంద్రీనదికి విడుదల చేస్తున్నారు. ఆదివారం కూడా 350 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కొనసాగుతుండగా.. ఎల్లెల్సీ నుంచి80 క్యూసెక్కుల నీరు జీడీపీలోకి వస్తుంది. దీంతో జీడీపీ నుంచి హంద్రీనదికి 330 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది. 4 టీఎంసీల నీటిని నిలువ వుంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జీడీపీ అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొని వెంకట్రాముడు(43) అనే వ్యక్తి మృతి చెందాడు. కడివెళ్ల గ్రామానికి చెందిన బోయ వెంకట్రాముడు ఆదోనిలో ఇల్లు నిర్మాణం చేసే మేస్త్రీ దగ్గర పని కోసం నాలుగు రోజులు క్రితం వెళ్లాడు. ఆదివారం ఆమవాస్య కావటంతో ఇంట్లో పెత్తర్లమాస్య పండగ చేసేందుకు రాత్రి ఎమ్మిగనూరుకు బయలుదేరాడు. బస్సులు లేకపోవటంతో తెర్నేకల్ బస్సు ఎక్కి ఆరేకల్ గురుకుల పాఠశాల దగ్గర రాత్రి బస్సు దిగాడు. డబ్బులు పోగొట్టుకోవటంతో చేసేది లేక రాత్రి కాలినడకన ఎమ్మిగనూరుకు బయలుదేరాడు. కేవీకే దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో తల పగలి మెదుడు బయటకు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని అటుగా వచ్చేవారు రూరల్ పోలీసులకు సమచారం ఇవ్వటంతో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి దగ్గర ఉన్న ఏటీఎం, ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకొని ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడి భార్య చిన్న లక్ష్మీ, ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఫరీదతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఎమ్మిగనూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 19 ఫుట్‌బాల్ పోటీలకు స్థానిక ఎస్ఎస్ఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఫరీద ఎంపికైంది. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శోభారాణి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, బసవరాజు, సృజనకుమారిలను ఎస్టీటీఎఫ్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి రాఘవేంద్ర అభినందించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖ దసరా సెలవులు ఇచ్చిన నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు స్పెషల్ క్లాసుల పేరుతో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ ఆదివారం తెలిపారు. ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెంచి తరగలు నిర్వహించే ఆయా పాఠశాలల యాజమాన్యాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను విద్యాశాఖల అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు.

నేటి నుంచి మద్దతు ధరతో ఉల్లి కొనుగోళ్లు ఉండవు

గోనెగండ్ల : సోమవారం నుంచి ఉల్లికి మద్దతు ధర రూ.1200 అమలులో ఉండదని తహసీల్దార్ రాజేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులకు ఊరట కల్పిస్తూ హెక్టారుకు రూ.50 వేల చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందన్నారు. సోమవారం నుంచి మార్కెట్ యార్డులో ఉల్లి క్రయవిక్రయాలు ట్రేడర్స్ ద్వారా జరుగుతాయని పీడీపీఎస్ సిస్టం అమలులో ఉండదని, అలాగే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ఉండదని చెప్పారు. రైతులు తమ ఉల్లి దిగుబడులకు ఎక్కడ మంచి ధర వస్తే అక్కడ అమ్ముకోవచ్చునని తెలిపారు.

23 నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

ఎమ్మిగనూరుటౌన్ కర్నూలు జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర ఆదివారం తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొంటారని పేర్కొన్నారు.

13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి

ఆదోని రూరల్: శాసనసభలో పాస్ చేసిన 13 గంటలు పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు, పట్టణ కార్యదర్శి వెంకన్న, పట్టణ సహకారదర్శి ఓ.బి.నాగరాజు, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం వారు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్మికులందరూ కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది 8 గంటల పనివిధానాన్ని 13 గంటలకు పెంచడానికి, మహిళా కార్మికులందరూ రాత్రి డ్యూటీ కావాలనే కూటమికి ఓటేశారా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే పని భారం తగ్గిస్తామని చెప్పిన కూటమి నేతలు నేడు పని గంటలను పెంచడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే పనిగంటలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం



ట్రస్ట్ నిర్వాహకుడు మాచాని రఘునాథ్‌కు పద్మశ్రీ మాచాని సోమప్ప చిత్రపటాన్ని అందజేసి సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: దశాబ్దాలుగా మాచాని సోమప్ప ట్రస్ట్ పేరిట సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమని పట్టణానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు అన్నారు. ట్రస్ట్ అధినేత మాచాని రఘునాథ్‌ను ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయుడు, చిత్రకారుడు కాకె వెంకటేషప్ప చిత్రించిన పద్మశ్రీ మాచాని సోమప్ప చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్టడీమెటీరియల్ అందజేసి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ట్రస్ట్ సహకారం అందించడం హర్షించదగ్గ విషయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోట్ల చంద్రశేఖర్, కరెకృష్ణ, బసవరాజు, మల్లారి భీమేష్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడిగా నెలకొంది. ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు తమ ఇంటి ఇలావేల్పును దర్శంచుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి బారులుదీరారు. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన పూజలు చేపట్టడంతో భక్తులు ఈ పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. భక్తులకు విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వివిపీ దర్శనాలు కల్పించారు.

బుడుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో..

ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు సమీపంలోని బుడుములదొడ్డిలో వెలసిన ఆంజనేయ స్వామిని దర్శనానికి కూడా తరలిరావడంతో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. అలాగే తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు

- మంత్రాలయంలో 11 రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారి అలంకరణలు



మంచాలమ్మ దేవి అమ్మవారు

మంత్రాలయం రూలర్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో నేటి నుంచి గ్రామ దేవత మంచాలమ్మ దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నారు. అమ్మవారికి నేటి నుంచి 11 రోజుల పాటు ప్రత్యేకాలంకరణ గావించి భక్తుల దర్శనార్థం వివిధ రూపాల్లో అలంకారణ గావించనున్నారు. ఉత్సవాలు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, వివిధ రూపాల్లో అమ్మవారు కొలువుదీరనున్నారు. సోమవారం మొదటి రోజు పాడ్యమి నాడు పూల అలంకారణ గావిస్తారు. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు.

కోసిగిలో శరన్నవరాత్రి ఉత్సవాలు



కందుకూరులో నవరాత్రి ఉత్సవాలకు విద్యుదీపాలతో ముస్తాబైన శాంభవి దేవాలయం

కోసిగి: మండల పరిధిలోని కందుకూరులో వెలసిన శ్రీ శాంభవి దేవి ఆలయంలో నేటి నుంచి దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దసర ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు అమ్మవారి వివిధ రూపాలలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు గానూ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు దేవి పురాణం భక్తులకు వినిపిస్తున్నట్లు భక్తులు తెలిపారు. అలాగే మండలంలోని ఆర్లబండ గ్రామంలో అంబాభవాని దేవి, కోసిగిలోని కాళికా దేవి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు.

కొలువుదీరుతున్న దుర్గామాత విగ్రహాలు

ఆదోని అర్బన్: దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పట్టణంలో ఆయా వీధుల్లో మంటప నిర్వాహకులు దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మంటపాలను సిద్ధం చేసి, విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక అలంకరణలో ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు ఆలయాల్లో ఆలయ నిర్వాహకులు అమ్మవార్లకు రోజూ ఒక రూపంలో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించనున్నారు.

ఎమ్మిగనూరులో చోరీ



ఇంట్లో చెల్లాచెదురుగా పడివున్న వస్తువులు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీలో శనివారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. కాలనీలో ఇళ్లకు తాళం వేసిన విషయాన్ని గుర్తించి దొంగలు అర్ధరాత్రి తాళాలను పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పద్దారు. పురుషోత్తం అనే వ్యక్తికి చెందిన ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం ధ్వంసం చేసి అందులో ఉన్న రూ. 24 వేల నగదు, తులం బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దొంగతనం చేసేటప్పుడు దొంగలు పక్కన ఉన్న మూడు ఇళ్లకు గడియపెట్టినట్లు తెలుస్తోంది. ఆదివారం ఉదయం గడియ రాకపోవటంతో కాలనీలో తెలిసిన వారికి ఫోన్ చేస్తే వచ్చి గడియ తీశారు. బయటకు వచ్చి చూస్తే దొంగతనం జరిగినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.